


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 303 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 5 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :303 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 5 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- జూలై 5 నుంచి 11 వరకు కొరియాలో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాలు, పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఎజెండా
- ఎల్జీ, హ్యోసంగ్ వంటి దిగ్గజ సంస్థలతో కీలక సమావేశాలు
- సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం కొరియాలో ప్రత్యేక రోడ్ షో



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో తమ దేశంలో పర్యటించాలని రిపబ్లిక్ ఆఫ్ కొరియా (దక్షిణ కొరియా)

- మిగతా 2లో




## తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- రావణ్ కు మద్దతుగా నిలిచిన ప్రకాశ్ రాజ్
- కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వరుస ట్వీట్లు
- రావణ్ తో ఉన్న చీకటి సంబంధాలు ఏమిటో చెప్పాలని డిమాండ్



పెన్ పవర్ డెస్క్:యూట్యూబర్ ప్రశ్న రావణ్ (జోసెఫ్) అరెస్టుల పర్వంపై నటుడు ప్రకాశ్ రాజ్ చేసిన విమర్శలకు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ ఘాటుగా బదులిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కావాలనే అశాంతిని, ఘర్షణ వాతావరణాన్ని రగిల్చేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందని ఆయన

- మిగతా 2లో

## జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"



- కడప స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ హయాంలోనే అన్నీ జరిగాయన్న అవినాశ్
- 2022లోనే 1100 ఎకరాల భూసేకరణ జరిగిందని వెల్లడి
- జగన్‌ను దూషించడానికే కడప సభ పెట్టినట్టుందన్న అవినాశ్

పెన్ పవర్ డెస్క్:"కడప స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి భూసేకరణ, పర్యావరణ అనుమతులు, జీవోల జారీ అంతా జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే జరిగితే...

- మిగతా 2లో

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

పెన్ పవర్ డెస్క్: వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాలకు సంబంధించిన ఏర్పాట్లపై తూర్పుగోదావరి జిల్లా అధికారులతో మంత్రి నారాయణ సమీక్షించారు. గోదావరి పుష్కరాల కోసం సీఎం చంద్రబాబు రూ. 1500 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వీటిలో కేవలం రాజమహేంద్రవరంలో పుష్కరాల కోసమే రూ. 580 కోట్ల పనులకు సీఎం అనుమతించారని చెప్పారు.

- మిగతా 2లో





## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

- 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని వెల్లడి
- పశ్చిమాసియా యుద్ధం వల్ల తలెత్తిన సంక్షోభాన్ని వ్యూహాత్మకంగా ఎదుర్కొన్నామని స్పష్టం
- చమురు రంగ కంపెనీలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని వెల్లడి
- ఇంధనం అందించే దేశాల సంఖ్యను 40కి పెంచుకున్నామన్న మోదీ

- మిగతా 2లో

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

- ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ప్రధాని మోదీకి ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు
- మెల్‌బోర్న్ ఈవెంట్‌కు సంబంధించిన ఫేస్‌బుక్ పోస్ట్ కింద హెచ్చరికతో కూడిన కామెంట్
- రంగంలోకి దిగిన ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు.. ఐపీ అడ్రస్ ఆధారంగా దర్యాప్తు
- ప్రధాని పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేసిన అధికారులు
- భద్రతను కట్టుదిట్టం చేసి, విచారణను అత్యంత ప్రాధాన్యతగా తీసుకున్న పోలీసులు

2లో



## ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- 2006లో మిడ్జిల్ జడ్పీటీసీగా రాజకీయ అరంగేట్రం
- తన తొలి గెలుపునకు వేదికైన మిడ్జిల్‌లో కృతజ్ఞతా కార్యక్రమం
- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగిన రాజకీయ ప్రయాణం
- ప్రజల ఆకాంక్షల నెరవేర్పుకే కృషి చేస్తానన్న రేవంత్



పెన్ పవర్ డెస్క్: ప్రజా ప్రతినిధిగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ చారిత్రక మైలురాయిని పురస్కరించుకుని, తన రాజకీయ జీవితానికి పునాది వేసిన మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలో శనివారం

- మిగతా 2లో



## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

### కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై బండి సంజయ్ ఫైర్

- రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్
- రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు
- రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు

- మిగతా 2లో



## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

- పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రావణ్ అలియాస్ జోసెఫ్
- కోర్టులు బెయిల్ ఇస్తున్నా ఇతర కేసుల్లో అరెస్ట్ చేస్తున్న పోలీసులు
- కూటమి ప్రభుత్వంపై ప్రకాశ్ రాజ్ విమర్శలు

- మిగతా 2లో



## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

### కీలక బిల్లులు, రాజకీయ సమీకరణాలపై ఉత్కంఠ

- జులై 20 నుంచి ఆగస్టు 13 వరకు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు
- మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ జరగనున్న భేటీ
- మహిళా రిజర్వేషన్, ఒకే దేశం ఒకే ఎన్నిక బిల్లులు అజెండాలో ఉండే అవకాశం

- మిగతా 2లో

# కుప్పంలోనూ బంగారం నిక్షేపాలు ఉన్నాయంటున్నారు... వెలికితీస్తాం

తన సొంత నియోజకవర్గమైన కుప్పాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా, దేశానికే ఆదర్శంగా నిలిపే 'స్వర్ణ కుప్పం' నిర్మాణానికి నాంది పలుకుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కుప్పం పర్యటనలో భాగంగా... రూ.118 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక ఆర్టీసీ బస్ స్టేషన్, డిపో పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ప్రసంగించిన చంద్రబాబు, అభివృద్ధి ప్రణాళికలను వివరిస్తూనే గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శనాస్త్రాలు సంధించారు.

**కుప్పంలోనూ బంగారు గనులు**

కర్నూలు జిల్లా జొన్నగిరిలో గోల్డ్ ఫీల్డ్స్ ప్రారంభించామని తెలిపారు. ఇప్పుడు కుప్పం ప్రాంతంలోనూ బంగారు గనులు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారని చంద్రబాబు సంచలన విషయం వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ బంగారు నిక్షేపాలను వెలికితీసి, 'స్వర్ణ కుప్పం' ఆవిష్కరణకు నిజమైన అర్థం కల్పిస్తామని ప్రకటించారు.

మైక్రో ఇరిగేషన్‌లో దేశానికే ఆదర్శంగా నిలిచిన కుప్పం మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు. హంద్రీ-నీవా జలాలతో 110 చెరువులు నింపామని గుర్తుచేశారు. రాయలసీమను ఉద్యాన హబ్?గా మార్చే 'పూర్వోదయ' ప్రాజెక్టుకు వచ్చే నెల మదనపల్లెలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు.

**ఉద్యోగాల కేంద్రంగా కుప్పం**

ఒకప్పుడు ఎన్టీఆర్ హయాంలో కుప్పంలో బస్ స్టేషన్‌కు శంకుస్థాపన జరిగిందని, ఇప్పుడు అదే స్థానంలో సౌర విద్యుత్ వంటి ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్ స్టేషన్, డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు తెలిపారు. కుప్పాన్ని స్వర్ణ కుప్పంగా మార్చే క్రమంలో పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. "ఉద్యోగాల కోసం కుప్పం యువత బయటకు వెళ్లడం కాదు, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం కుప్పానికి వచ్చే పరిస్థితి కల్పిస్తాం" అని ఆయన ఉద్ఘాటించారు. ఒక్క రోజులోనే రూ.9,322 కోట్ల పెట్టుబడులతో 30 ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, ఒప్పందాలు జరిగాయని, వీటి ద్వారా సుమారు 80 వేల మందికి ఉపాధి లభిస్తుందని వివరించారు. ప్రఖ్యాత అడిడాస్ ఫుట్‌వేర్ సంస్థతో పాటు టూ సీటర్ ట్రైనీ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ, డెయిరీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కుప్పానికి వస్తున్నాయని వెల్లడించారు.

**కాలుష్య రహిత, సుస్థిర అభివృద్ధి**

ఎస్సీ, ఎస్టీలకు సోలార్ రూఫ్‌టాప్ ద్వారా ఉచిత విద్యుత్, బీసీ, ఓసీలకు రూ.552 కోట్లతో సౌర విద్యుత్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. 'నెట్ జీరో' విధానంలో భాగంగా ఇళ్లపైనే కూరగాయలు పండించుకోవడం, ఈ-సైకిళ్ల వాడకం పెంచి కుప్పాన్ని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. కుప్పంలోని బ్లూ గ్రానైట్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని 'హెరిటేజ్ గ్రానైట్ క్లస్టర్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కుప్పంపై కక్ష కట్టిందని, అభివృద్ధిని అడ్డుకుందని చంద్రబాబు ఆరోపించారు. "నీళ్లు తెచ్చామని సినిమా సెట్టింగులు వేసి డ్రామాలు ఆడారు. 2019-24 మధ్య నన్ను నా నియోజకవర్గంలోనే తిరగనివ్వకుండా అడ్డంకులు సృష్టించారు. నాకు సహకరించిన వారిని వేధించారు" అని మండిపడ్డారు. రాయలసీమలో ఫ్యాక్షన్ రాజకీయాలకు కాలం చెల్లిందని, ఇప్పుడు అభివృద్ధే తమ అజెండా అని స్పష్టం చేశారు. సంఘ విద్రోహ శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. వివేకానందరెడ్డి హత్య, కోడికత్తి డ్రామా, డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఘటనలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను ఎండగట్టారు.

**'మావిగన్' అంటూ గొడ్డలి పార్టీ వింత వాదన**

రాజధానిపై గత ప్రభుత్వం రోజుకో మాట మాట్లాడిందని విమర్శించారు. ప్రజలందరూ అమరావతినే రాజధానిగా కోరుకుంటుంటే, 'గొడ్డలి పార్టీ' మాత్రం వాటికన్ తరహాలో 'మావిగన్' కావాలంటోందని ఎద్దేవా చేశారు. గొడ్డలి పార్టీ అని తాము అనడం కాదని, వారే అంగీకరిస్తున్నారని వ్యాఖ్యానించారు. కుప్పం అభివృద్ధికి సుర్బానా జురాంగ్, ఐఐటీ కాన్పూర్ వంటి సంస్థల సహకారంతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు ఎలిఫెంట్ సఫారీ, రాక్ క్లైంబింగ్ వంటి ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజా భాగస్వామ్యంతో కుప్పాన్ని దేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎడిటర్ వ్యూ

### ప్రజా జీవితంలో రేవంత్ రెడ్డి 20 ఏళ్లు.. జడ్పీటీసీ నుంచి సీఎం దాకా!

- మొదటి పేజి తరువాయి

ఆయన పర్యటించారు. సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం, 2006 జులై 4న ఇదే మిడ్జిల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ సభ్యుడిగా విజయం సాధించి రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. ఎటువంటి రాజకీయ నేపథ్యం లేని సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ రెడ్డి, 2007లో స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009, 2014 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్ర విభజన అనంతరం టీడీపీ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2017లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన, 2018 ఎన్నికల్లో పరాజయం పాలైనప్పటికీ పట్టువదలకుండా 2019లో మల్కాజ్‌గిరి ఎంపీగా ఘనవిజయం సాధించారు. 2021లో టీపీసీసీ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టి, 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

మిడ్జిల్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఉర్కొండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తన రాజకీయ ప్రస్థానం తొలినాళ్లలో అండగా నిలిచిన మద్దతుదారులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ తన రెండు దశాబ్దాల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "మిడ్జిల్ రేవంత్ రెడ్డి నుంచి ప్రతి గుండెలో 'రేవంత్ అన్న' వరకు సాగిన ఈ అద్భుత ప్రయాణం నా జీవితంలో ఒక ప్రత్యేక అధ్యాయం" అని ఆయన 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరిత పోస్ట్ చేశారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సహా పలువురు నేతలు రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగిన ఆయన ప్రస్థానానికి ఈ కార్యక్రమం అద్దం పట్టింది.

### మంత్రి నారా లోకేశ్ కు దక్షిణ కొరియా అధికారిక ఆహ్వానం...

- మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం ఆయన్ను అధికారికంగా ఆహ్వానించింది. ఈ మేరకు ఆయన జూలై 5 నుంచి 11వ తేదీ వరకు కొరియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి లోకేశ్.. కొరియాలోని పలు మంత్రిత్వ శాఖల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో పాల్గొంటారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెన్నైలోని దక్షిణ కొరియా కాన్సులేట్ జనరల్ చాంగ్ న్యాన్ కిమ్, మంత్రి లోకేశ్ కు పంపిన ఆహ్వాన లేఖలో పేర్కొన్నారు. భారత్-కొరియా మధ్య సంబంధాలను మరింత పటిష్ఠం చేయడంలో ఈ పర్యటన ఒక కీలక ముందడుగు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**లోకేశ్ పర్యటన షెడ్యూల్**

జులై 5న సియోల్‌లో ఇండియా దయాస్పోరా ఏర్పాటు చేసే ఆత్మీయ సమావేశానికి హాజరై అక్కడి భారతీయులు, ముఖ్యంగా తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

జులై 6వ తేదీన దక్షిణ కొరియాకు చెందిన టెక్ స్టార్టప్ సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని, పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. అనంతరం, హ్యోసంగ్ భారీ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు టకేషి యెకోటా, సియోల్ సెమీకండక్టర్స్ వైస్ ప్రెసిడెంట్ టేహ్యూంగ్ లీతో లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమవుతారు.

జులై 7న ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్జీ టవర్స్‌లో కీలక సమావేశం జరగనుంది. ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ జు కోహ్ ఏర్పాటు చేసిన విందు సమావేశంలో లోకేశ్ పాల్గొంటారు. ఈ భేటీకి ఎల్జీ అనుబంధ సంస్థల ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందాలు కూడా హాజరుకానున్నాయి.

జులై 8వ తేదీన కొరియన్ మెరైన్ అక్విప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులతో భేటీ ఉంటుంది. జులై 9న కొరియన్ పొలిటికల్ అఫైర్స్, ఇంటర్నేషనల్ ట్రేడ్ & ఇన్వెస్ట్‌మెంట్స్ విభాగాల డిప్యూటీ మంత్రులతో వేర్వేరుగా భేటీ అవుతారు. జులై 10వ తేదీన వివిధ సంస్థల ప్రతినిధులతో పెట్టుబడుల గురించి చర్చించడంతో పాటు, కొరియా ఆటో ఇండస్ట్రీ కోఆపరేషన్ ఏజెన్సీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరవుతారు.

అదే రోజు రాత్రి, విశాఖలో జరగనున్న సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026ను విజయవంతం చేయాలని కోరుతూ కొరియా కంపెనీల ప్రతినిధులతో నిర్వహించే ప్రత్యేక రోడ్ షోలో పాల్గొంటారు. 11వ తేదీన దక్షిణ కొరియా నుంచి తిరిగి రానున్నారు. ఈ పర్యటన ద్వారా ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది.

### తాడేపల్లి నుంచి ఎంత డబ్బు అందుతోంది?: ప్రకాశ్ రాజ్ పై కందుల దుర్గేశ్ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఆరోపించారు. మీడియా ముఖంగా ప్రకాశ్ రాజ్, రావణ్‌లపై విరుచుకుపడిన మంత్రి... వారిద్దరినీ సమాజ విద్రోహ శక్తులుగా అభివర్ణించారు. అసలు ఈ వివాదాస్పద యూట్యూబర్‌తో ప్రకాశ్ రాజ్‌కు ఉన్న చీకటి సంబంధాలేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలు సాగాయని, హిందూ దేవాలయాలపై దాడులు జరిగాయని.. అప్పుడు లేవని ప్రకాశ్ రాజ్ గొంతు ఇప్పుడు ఎందుకు లేస్తోందని మంత్రి కందుల దుర్గేశ్ నిలదీశారు. "నాడు మూగనోము నోమిన మీరు.. నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడానికి తాడేపల్లి ప్యాలెస్ నుంచి ప్రతి నెలా ఎంత డబ్బు అందుకుంటున్నారు?" అంటూ నేరుగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం, రాష్ట్రంలో అశాంతిని రేకెత్తించి శాంతిభద్రతలను దెబ్బతీయడానికే ఇలాంటి శక్తులు కుట్రలు పన్నుతున్నాయని, వీటిని ప్రభుత్వం కఠినంగా అణచివేస్తుందని మంత్రి హెచ్చరించారు.

### జగన్ హయాంలోనే అన్నీ జరిగితే.. చంద్రబాబు క్రెడిట్ చోరీ ఏంటి?"

- మొదటి పేజి తరువాయి

ఇప్పుడు సీఎం చంద్రబాబు ఆ క్రెడిట్ నాదే అని చెప్పుకోవడం హాస్యాస్పదం" అని వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి విమర్శించారు. శనివారం కడపలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం పాత ప్రాజెక్టులపై 'క్రెడిట్ చోరీ'కి పాల్పడుతోందని మండిపడ్డారు. 2019లోనే జేఎస్‌డబ్ల్యూ సంస్థను కడపలో స్టీల్ ప్లాంట్ పెట్టేందుకు జగన్ ప్రభుత్వం ఒప్పించిందని అన్నారు. ఆ తర్వాత 2022లో ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమైన అధికారిక జీవోలను జారీ చేయడంతో పాటు, ఫేజ్-1 కింద 1100 ఎకరాల భూసేకరణను కూడా పూర్తి చేసిందన్నారు. 2023 ఫిబ్రవరిలో అప్పటి సీఎం జగన్ స్వయంగా ఈ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారని తెలిపారు. పర్యావరణ అనుమతులు సహా అన్ని క్లియరెన్సులు తమ ప్రభుత్వమే తెచ్చిందని.. ఈ విషయాన్ని జేఎస్‌డబ్ల్యూ అధినేత సజ్జన్ జిందాల్ స్వయంగా ప్రకటించారని తెలిపారు. తాజాగా కడప సభలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ.. ఆ సభ స్టీల్ ఫ్యాక్టరీ అభివృద్ధి కోసం కాకుండా, కేవలం జగన్‌ను దూషించడానికే పెట్టినట్లు ఉందని ఎద్దేవా చేశారు.

ఇదే క్రమంలో అమరావతి రాజధానిపైనా అవినాశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతి అనేది రాష్ట్ర ప్రజలందరి రాజధాని కాదని, అది కేవలం ఒక వర్గానికి చెందిన రాజధానిగా మారిందని ఆరోపించారు. ఈ విషయాన్ని స్వయంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా గతంలో అంగీకరించారని అన్నారు. నాడు శివరామకృష్ణ కమిటీ ఇచ్చిన శాస్త్రీయ సూచనలను తుంగలో తొక్కిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతి కోసం ఏకంగా రూ.2 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథాగా ఖర్చు చేయాలని చూస్తున్నారన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా జగన్... మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాలను అనుసంధానిస్తూ, రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఉపయోగపడే ఆచరణాత్మకమైన 'మావిగన్' నమూనాను ప్రతిపాదించారని చెప్పారు.

## శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని అధిగమించాం

పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. సరైన సమయంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, వ్యూహాత్మక ప్రణాళికలు మరియు పటిష్ఠమైన దౌత్యం వల్లనే ఇది సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. శనివారం రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లాలో ఒక భారీ ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. "నవ భారత సంకల్పం, కృషితో 21వ శతాబ్దపు అతిపెద్ద ఇంధన సంక్షోభాన్ని మనం అధిగమించాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా హర్ముజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో ఇంధన సరఫరాకు తీవ్ర విఘాతం ఏర్పడిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సంక్షోభాన్ని ముందుగానే అంచనా వేసి, జాతీయ వనరులను సద్వినియోగం చేసుకోవడంతో పాటు, దౌత్య సంబంధాల ద్వారా చమురు సరఫరాకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఇంధన సంక్షోభం తలెత్తిన సమయంలో

వినియోగదారులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ రంగ చమురు సంస్థలు రూ. 75,000 కోట్లకు పైగా నష్టాలను భరించాయని, ప్రభుత్వం వారికి పూర్తి అండగా నిలిచిందని ప్రధాని వివరించారు. దౌత్యపరమైన చొరవతో, మనకు ఇంధనం అందించే దేశాల సంఖ్యను 25 నుంచి 40కి పెంచుకున్నామని, దీనివల్ల దేశంలో ఎక్కడా కొరత ఏర్పడకుండా చూడగలిగామని తెలిపారు. కొందరు ప్రతిపక్ష నేతలు ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రభుత్వం తెరవెనుక చేసిన కృషి చరిత్రాత్మకమని వ్యాఖ్యానించారు. ఈ విజయం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

## ఎన్నిసార్లు అరెస్ట్ చేస్తారు?: ప్రకాశ్ రాజ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన యూట్యూబర్ ప్రశ్న రావణ్ (బచ్చలకూరి జోసెఫ్)పై ఏపీలో పలు కేసులు నమోదైన సంగతి తెలిసిందే. బెయిల్ పై అతడు బయటకు వస్తున్నప్పటికీ... ఇప్పటికే నమోదైన ఇతర కేసుల్లో మళ్లీ పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. దీనిపై సినీ నటుడు ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లను ట్యాగ్ చేస్తూ ఆయన విమర్శనాత్మకంగా ట్వీట్ చేశారు. "అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. అరెస్ట్.. బెయిల్.. మళ్లీ అరెస్ట్. మీరు తప్పు చేస్తున్నారని మీకు కోర్టులు స్పష్టంగా చెప్పడం లేదా? మీ కక్షపూరిత రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారు" అంటూ ప్రకాశ్ రాజ్ విమర్శలు గుప్పించారు. "ప్రశ్నించే వారిని అధికారాన్ని దుర్వినియోగం చేసి అణచివేయడం ఎంతవరకు సాగుతుంది? కోర్టు బెయిల్ ఇచ్చిన వెంటనే మరో కేసు తెరిచి వేధించడం సిగ్గుచేటు" అని మండిపడ్డారు. రావణ్ ఏలూరులో పవన్ కల్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలు వైరల్ అయిన తర్వాత పిఠాపురం పోలీసులు అతన్ని అరెస్టు చేశారు.

కాకినాడ కోర్టు బెయిల్ మంజూరు చేయగా, వెంటనే సర్పవరం పోలీసులు మరో పాత కేసులో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. రావణ్‌పై మొత్తం 30 కేసులు ఉన్నాయని, ఇది స్పష్టమైన ప్రతీకార చర్య అని ప్రకాశ్ రాజ్ ఆరోపించారు. జనసేన కార్యకర్తలు పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న ఘటనను కూడా ఆయన ప్రస్తావిస్తూ... ప్రశ్నిస్తే చంపేస్తారా? అని ప్రశ్నించారు.

## ఆస్ట్రేలియా వస్తే చంపేస్తాం... ప్రధాని మోదీకి బెదిరింపులు

భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు కొద్ది రోజుల ముందు ఆన్‌లైన్‌లో హత్య బెదిరింపు రావడం కలకలం రేపింది. ఈ ఘటనపై ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసులు (ఏఎఫ్‌పీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రధాని మోదీ పర్యటనను, ప్రవాస భారతీయులతో జరగనున్న భారీ కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ బెదిరింపు వెలువడింది. వివరాల్లోకి వెళితే, ప్రధాని మోదీ జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమ ప్రచారంలో భాగంగా ఫేస్‌బుక్‌లో పెట్టిన ఒక పోస్ట్ కింద 'అబు ముస్తఫా' అనే ఖాతా నుంచి బెదిరింపు కామెంట్ వచ్చింది. "ఈవెంట్ సమయంలో స్టేడియం పైకప్పులు మూసి ఉంచడం మంచిది. లేదంటే, ఆయన తన చావు కోసమే ఆస్ట్రేలియాకు వస్తున్నట్లు అవుతుంది" అని ఆ కామెంట్‌లో పేర్కొన్నారు. ఈ విషయం జూలై 3న ఆస్ట్రేలియా ఫెడరల్ పోలీసుల దృష్టికి వెళ్ళింది. వెంటనే రంగంలోకి దిగిన దర్యాప్తు అధికారులు, బెదిరింపు పోస్ట్ చేసిన ఖాతాకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు సమాచారం. అయితే, దర్యాప్తు కొనసాగుతున్నందున ఈ విషయంపై పూర్తి వివరాలు వెల్లడించడానికి ఏఎఫ్‌పీ నిరాకరించింది.

ఇప్పటివరకు ఎవరినీ అరెస్ట్ చేసినట్లు ప్రకటించలేదు. ఆస్ట్రేలియా-భారత్ వార్షిక నాయకత్వ సదస్సు కోసం ప్రధాని మోదీ జూలై 8 నుంచి 10 వరకు ఆస్ట్రేలియాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో రక్షణ, భద్రత, వాణిజ్యం వంటి కీలక అంశాలపై ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. ఈ బెదిరింపు నేపథ్యంలో ఆస్ట్రేలియా భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రధాని మోదీ పర్యటనకు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయన పర్యటన షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు.

## తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

- మొదటి పేజి తరువాయి

అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు. పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి

పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

## ఈ నెల 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జులై 20వ తేదీ నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు ఈ సమావేశాలు జరగనున్నాయని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. జాతీయ ప్రాధాన్యత కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, నిర్ణయాలు తీసుకోవడమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతాయని ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంట్ ఉభయ సభలను సమావేశపరచడానికి ఆమోదం తెలిపారని రిజిజు వివరించారు. మొత్తం నాలుగు వారాల పాటు జరిగే ఈ సెషన్‌లో 19 రోజుల పాటు సభా కార్యకలాపాలు జరగనున్నాయి. ఈసారి వర్షాకాల సమావేశాలు మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో వాడీవేడిగా జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్ష కూటమిలో నెలకొన్న విభేదాలు, అధికార ఎన్డీయే బలాన్ని పెంచే పరిణామాలు ఈ సెషన్‌పై ప్రభావం చూపనున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది రెబల్ ఎంపీలు ఎన్సీపీఐలో విలీనం కావడం, ఉద్ధవ్ థాకరే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరడం వంటి అంశాలపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలతో పార్లమెంటులో ఎన్డీయే బలం మరింత పెరగనుండగా, విపక్ష 'ఇండియా' కూటమి బలహీనపడనుందని అంచనాలు వెలువడుతున్నాయి. మరోవైపు తమిళనాడులో కాంగ్రెస్ పార్టీ టీవీకేతో పొత్తు పెట్టుకోవడంతో డీఎంకే తీవ్ర అసంతృప్తితో ఉంది. ఈ నేపథ్యంలో తమ ఎంపీలకు కాంగ్రెస్ సభ్యులతో సంబంధం లేకుండా ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని కోరుతూ డీఎంకే ఇప్పటికే స్పీకర్‌కు లేఖ రాసింది. ఈ పరిణామాలన్నీ సభలో ప్రతిపక్షాల ఐక్యతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

**ప్రభుత్వ అజెండాలో కీలక బిల్లులు**

ఈ సమావేశాల్లో పలు కీలక బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత సమావేశాల్లో తిరస్కరణకు గురైన మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు ఈసారి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు వరుసగా 30 రోజులకు మించి జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారి పదవులు వాటంతట అవే రద్దయ్యేలా నిబంధనలు తీసుకొచ్చే 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

అలాగే, దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' బిల్లు కూడా కేంద్రం అజెండాలో ఉండే అవకాశం ఉంది. వీటితో పాటు విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్‌ఏ) సవరణ బిల్లు, వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, యాంటీ-డోపింగ్ బిల్లులను కూడా సభ ముందుకు తీసుకురావడానికి రంగం సిద్ధమైంది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఆర్డినెన్స్ స్థానంలో కొత్త బిల్లుతో పాటు వేతన నియమావళి, కార్పొరేట్ లా, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్‌లకు సంబంధించిన ప్రతిపాదనలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వర్షాకాల సమావేశాలు చట్ట సభల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణానికి దారితీయవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై మంత్రి నారాయణ సమీక్ష

- మొదటి పేజి తరువాయి

'పుష్కరాలకు రాజమహేంద్రవరంలో కల్పించాల్సిన సదుపాయాలపై చర్చించాం. పనులు వెంటనే ప్రారంభించాలన్న సీఎం ఆదేశాల మేరకు చేపట్టాల్సిన పనులు నిర్ణయించాం. ప్రస్తుత నిధులతో తొలిదశ పనులు ప్రారంభిస్తున్నాం. రాజమహేంద్రవరంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాలను నిర్మిస్తాం. గోదావరిలో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకుంటాం. రాజమహేంద్రవరంలో డ్రైనేజీ కాల్వల నిర్మాణం కోసం రూ.140కోట్లతో పనులు ప్రారంభిస్తాం.. రోడ్ల నిర్మాణం, విస్తరణ, లైటింగ్ పనులు చేపడతాం. టీడీఆర్ బాండ్లు జారీ చేసి, నగరంలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడతాం. గోదావరి కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నిధులు కేటాయిస్తాం. ఘాట్ల ఆధునికీకరణ, విస్తరణను ఇరిగేషన్ శాఖ నిధుల ద్వారా అభివృద్ధి చేస్తాం" అని నారాయణ అన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# డివిజనల్ పీఆర్ఓ రవికి జిల్లా పౌర సంబంధ అధికారిగా పదోన్నతి



**తూర్పుగోదావరి జిల్లా డీఐపీఆర్ఓగా నియామకం**

**కాకినాడ, పెన్ పవర్,జూలై 4:** జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో డివిజనల్ పీఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి రవికి జిల్లా పౌర సంబంధ అధికారి గా పదోన్నతి కల్పిస్తూ సమాచార శాఖ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో డీఐపీఆర్ఓగా నియమితులై, కాకినాడ కార్యాలయంలో ప్రత్యేక విధులు నిర్వహిస్తున్న ఆయనను పదోన్నతిపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డీఐపీఆర్ఓగా నియమించారు. ఈ సందర్భంగా సమాచార శాఖ జోన్-2 జాయింట్ డైరెక్టర్ పి. తిమ్మప్ప రవికి పదోన్నతి ఉత్తర్వులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కాకినాడ సమాచార శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది, పాత్రికేయులు రవిని అభినందిస్తూ ఆయన కొత్త బాధ్యతల్లో మరింత విజయవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు



**✷ ప్రత్తిపాడులో సిఐటియు ఆధ్వర్యంలో ఘన నివాళులు**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై, 4:** భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన త్యాగాలు, జరిపిన పోరాటాలు చిరస్మరణీయమని సిఐటియు సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కొనియాడారు. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా శనివారం సిఐటియు ప్రత్తిపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ రోడ్డులో గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సి.హెచ్.సి శానిటేషన్ఢసెక్యూరిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు గంజి కామేశ్వరరావు, పిట్ట రాజులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

?ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి, వారి హక్కుల కోసం అల్లూరి సాగించిన మన్యం విప్లవం దేశ చరిత్రలోనే ఒక మహోజ్వల ఘట్టమని అన్నారు. నాటి అల్లూరి పోరాట స్ఫూర్తితో నేటి కార్మిక, కర్షక లోకం తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం ఎవరైతే సామ్రాజ్యవాదులు మన దేశాన్ని దోచుకుంటున్నారో అదే సామ్రాజ్యవాదులతో మోడీ ప్రభుత్వం జత కట్టడం దేశ స్వతంత్ర స్ఫూర్తికి విరుద్ధమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లు ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఈ సందర్భంగా అన్నారు.

?ఈ కార్యక్రమంలో కార్మికులు మహేష్,ఆర్.రాజు,పి.సూరిబాబు, సత్యవతి, మంగా,అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే బండారుకు ఘన స్వాగతం





**✷ సాలువాతో సత్కరించి చిత్రపటం బహూకరణ**
**✷ ఎరువుల పంపిణీ, సొసైటీ పనితీరుపై ఆరా**

**ఆలమూరు, పెన్ పవర్,జూలై 04;** ఆలమూరు సహకార సంఘానికి తొలిసారిగా విచ్చేసిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. రైతులు, సొసైటీ సిబ్బంది, కూటమి నాయకులు కలిసి పూలమాలలతో ఆత్మీయంగా ఆహ్వానించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సాలువాతో ఘనంగా సత్కరించి ఆయన చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సొసైటీ పాలకవర్గ సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం సొసైటీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. సొసైటీ కార్యకలాపాలు, రైతులకు అందిస్తున్న సేవలు, ఎరువుల నిల్వలు, పంపిణీ విధానం, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సొసైటీ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సొసైటీ పాలకవర్గం సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ పాలకవర్గ సభ్యులు, రైతులు, సిబ్బంది, వేద పండితులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వంగవీటి మోహన్ రంగా చిరస్మరణీయుడు



**కాంగ్రెస్ ఇంచార్జ్ మరోతి శివ గణేష్**

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బెజవాడ బెబ్బులి, అంబేద్కర్ ఆశయ సాధకుడు, బహుజనులకు రాజ్యాధికార కాంక్షితుడు, 10 కోట్ల మంది తెలుగు ప్రజల గుండె చప్పుడు వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి సందర్భంగా జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో గల శ్రీ వంగవీటి మోహన్ రంగా విగ్రహానికి జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రంగా అభిమానులతో కలిసి పూలమాలలు అలంకరించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జగ్గంపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను భుజాన వేసుకుని బహుజనులకు రాజ్యాధికారం సిద్ధించే దిశగా శ్రీ వంగవీటి మోహన్రంగా పేద ప్రజల తరపున పోరాటం చేశారని, చివరకు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ బీసీ సోదరుల ఇండ్ల స్థలాల పట్టాల కోసం ప్రభుత్వం పై నిరసన తెలియజేస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగిన శ్రీ వంగవీటి మోహన్ రంగాని అత్యంత పాసవికంగా అమానవీయంగా రాక్షసత్వం గా బాంబులు విసిరి కత్తులతో నరికి నరికి రెండు సామాజిక వర్గాలకు చెందిన వారి హత్య చేశారని శివ గణేష్ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ వన్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటరతనం అనే చిన్నారి, గండేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు నేదురి భాస్కరరావు, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ కార్యదర్శి గంప కొండబాబు యాదవ్, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి జాడ చైతన్యకుమార్, కాట్రావులపల్లి గ్రామ రంగా అభిమానులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతులకు రాజముద్ర తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 04;** కూటమి ప్రభుత్వంలో రాజముద్రతో కూడిన,తప్పులు లేని పాస్ పుస్తకాలు రైతులకు అందజేస్తున్నామని, అవి వారికి ఎంతో కీలకమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని జొన్నాడలో జరిగిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైసీపీ హయంలో జగన్ తన సొంత ఫోటోలతో పాస్ పుస్తకాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎన్డీఏ కూటమి ఈ అంశాన్ని గమనించి, రైతుల ఆందోళనను అర్థం చేసుకొని పాత వాటిని రద్దు చేసి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందిస్తుందన్నారు. ఈ పాస్ పుస్తకాలపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే తమ భూమి వివరాలు రైతులకు పూర్తిగా తెలుస్తాయన్నారు. అంతటి టెక్నాలజీతో ఈ పాస్ పుస్తకాలలో జరిగిన తప్పులన్నీ సరి దిద్దుతూ అందించడం జరిగిందన్నారు. జొన్నాడ లో 3,028 ఎకరాల భూమి ఉండగా హక్కుదారులు ఎల్పీఎంల రూపంలో 2,036 మంది ఉన్నారన్నారు. వీరికి 1628 రికార్డులు ఉండగా పూర్తిగా ఎటువంటి తప్పులు లేకుండా, సరిచేసి పాస్ బుక్స్ అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కె.కుశరాజు, టిడిపి మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, సొసైటీ చైర్మన్ మేడపాటి రామారెడ్డి, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబి, నామాల సూరిబాబు, భావన శ్రీనివాస్,తాడి సత్యనారాయణరెడ్డి, చింతలపూడి శ్రీనివాస్ మారిశెట్టి శ్రీనివాస్,గుత్తుల పవన్ జీ, తదితరులు పాల్గొన్నారు.

## వంగవీటి జయంతి సందర్భంగా ఉత్తరకంచిలో భారీ అన్నదానం




**-రంగా యువసేన ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై, 4:** ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వంగవీటి మోహన రంగా జయంతి సందర్భంగా భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తరకంచి వంగవీటి రంగా యువసేన ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో,పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ మంతెన వెంకటరమణ యువసేన సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. సామాజిక సేవా దృక్పథంతో,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్నదానం నిర్వహించడం ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. యువసేన సభ్యులు సుంకర సురేష్, శీరం సురేష్, యాతం చిన్న, వీరపురెడ్డి హరిబాబు, ఉమ్మిడి సురేష్, బొరుసు రాజా, పోతురాజు నాని, గున్నాబత్తుల వీరబాబు, అనపర్తి రాంబాబు, బొడ్డు సురేష్, శీరం శ్రీను, పోతురాజు శివ, కొప్పిరెడ్డి స్వామి, రామిశెట్టి నాని, నాగులాపల్లి అప్పాజీ, సాధనాల చక్రయ్య, అన్నెం నాగు, యర్రంశెట్టి రాజా, ఏడిద సాయి, దూళ్ళ శేఖర్, గున్నాబత్తుల సాయి, కంటే అశోక్, ద్వారపురెడ్డి ప్రసాద్, చింతల పుష్పరాజ్, సాధనాల గణేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరకంచి రంగా యువసేన సభ్యులు మాట్లాడుతూ మా అందరి ఆరాధ్య దైవం వంగవీటి రంగా సేవా భావాన్ని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అన్నవరం రత్నగిరిపై ఘనంగా శ్రీ సత్యదేవుని ప్రాకార సేవ







**అన్నవరం,పెన్ పవర్ జూలై 04:** కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధానంలో శనివారం సందర్భంగా ప్రాకార సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. వీకెండ్ (శనివారం) కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది.

?ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పలు రకాల సుగంధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల ఘోష, భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామి, అమ్మవార్ల వాహన సేవను ఆలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణగా ఊరేగించారు.

?రత్నగిరి కొండపై భక్తిభావం ఉప్పొంగేలా సాగిన ఈ ప్రాకార సేవా కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు, దేవస్థానం సిబ్బందితో పాటు స్థానిక గ్రామస్థులు, పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తరించారు.

# రామవరంలో రైతులకు రాజముద్ర పాస్ పుస్తకాలు పంపిణీ

**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా, పూర్తి పారదర్శకతతో రైతులకు రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందజేస్తున్నామని జగ్గంపేట ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో శనివారం రైతులకు రాజ్యముతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో 1408 మంది రైతులకు నూతన పాస్ పుస్తకాలను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు అడబాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 1643 పాస్ పుస్తకాలకు గాను 1408 పంపిణీ పూర్తయింది. మిగిలిన 235 పుస్తకాలను సాంకేతిక కారణాల పరిశీలన అనంతరం వారం రోజుల్లో అందిస్తామని తహసీల్దార్ జేవిఆర్ రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పత్రాలు వ్యక్తి కేంద్రంగా కాకుండా వ్యవస్థ కేంద్రంగా ఉండాలి. రాజముద్ర అనేది వ్యవస్థకు చిహ్నం. అందుకే ఈ మార్పు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాస్ పుస్తకాలపై జగన్ తన వ్యక్తిగత ఫోటోలు ముద్రించి, ల్యాండ్ టైటిలింగ్ చట్టం పేరుతో రైతాంగంలో అభద్రత సృష్టించారు. దాని ఫలితాన్ని ప్రజలు ఎన్నికల్లో చూపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానం స్పష్టం – రైతు భూమికి సంపూర్ణ రక్షణ, ప్రభుత్వ పరంగా పూర్తి భరోసా. అందులో భాగమే




ఈ రాజముద్ర పాస్ పుస్తకాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, రాష్ట్ర డైరెక్టర్లు కొత్త కొండబాబు, పోతుల మోహనరావు, ఎమ్మార్వో జేవియర్ రమేష్, జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర, మాజీ సర్పంచ్ మండపాక చిన్న, జనసేన ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మండల జనసేన యువత అధ్యక్షులు మొగిలి గంగాధర్ జగ్గంపేట ఆర్ఐ జి మంగపతి నాయుడు బాబు, టీడీపీ, జనసేన నాయకులు, అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## వాడపల్లి చందన స్వరూపుడు శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న :సినీ దర్శకుడు హరీష్ శంకర్





**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 4:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి చందన స్వరూపుడు శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకుడు హరీష్ శంకర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల్లో భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. హరీష్ శంకర్ స్వామివారి ఆశీస్సులు స్వీకరించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ఆయన ఆలయానికి విచ్చేసిన సందర్భంగా పలువురు భక్తులు ఆయనను కలిసి అభివాదం చేశారు.

## జగ్గంపేటలో అల్లూరి సీతారామరాజు జయంతి

* నివాళులర్పించిన జనసేన ఇంచార్జ్ రమేష్



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జగ్గంపేట టౌన్‌లోని క్షత్రియ ఫంక్షన్ హాల్‌లో అల్లూరి విగ్రహానికి జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను అర్పించి గిరిజనుల హక్కుల పరిరక్షణకు పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కురుమల్ల నాగేశ్వరావు, పాఠంశెట్టి రమేష్, గో?కేడ ప్రసాద్, కాయల మణికంఠ, గంధం శ్రీను, గాది నాగరాజు, రేళ్ళ ప్రసాద్, శ్రీను జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలు



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 93వ జయంతి వేడుకలను జగ్గంపేట ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు ముఖ్యఅతిథిగా, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు విశిష్ట అతిథిగా హాజరై రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కొత్త కొండబాబు మాట్లాడుతూ, 70 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోండా నూకబాబు, మానేపల్లి బంగార్రాజు, కొత్త శ్రీరామకృష్ణ, వి నాగసత్య, బోండా వీరసత్య, కంచర్ల బాబు, మాతంశెట్టి సాయిబాబా, కంచర్ల రమాదేవి, ఆర్యవైశ్య సేవా సంఘం సభ్యులు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో 70మందికి రూ.32 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** జగ్గంపేట నియోజకవర్గంలోని 70 మంది లబ్ధిదారులకు రూ. 32 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ శనివారం పంపిణీ చేశారు. స్థానిక రావులమ్మ నగర్ టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ చెక్కులు అందజేశారు. జగ్గంపేట మండలంలో 17 మంది, కిర్లంపూడి మండలంలో 11 మంది, గోకవరం మండలంలో 23 మంది, గండేపల్లి మండలంలో 11 మంది, ఇతరులు 2, ఎల్ఓసీలు 6 మొత్తం 70 మందికి రూ. 32 లక్షల సహాయం అందించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని అన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికే మొదటి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పవన్ కళ్యాణ్ ప్రజల సమస్యలపై చూపుతున్న చొరవ అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, జగ్గంపేట, గోకవరం మండల టిడిపి అధ్యక్షులు జీను మణిబాబు, పిల్ల చంటిబాబు, రేఖ బుల్లి రాజు, జాస్తి వసంత్, పాలకుర్తి ఆదినారాయణ, య ల్లమిల్లి సీఎం, పురం శెట్టి శివాజీ, పులపర్తి బుజ్జి అధిక సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** స్వతంత్ర సమరయోధుడు , మన్యం విప్లవ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి బి.రమేష్ ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల హక్కులను కాలరాస్తూ, భారతదేశ ప్రజల సంపదను దోపిడీ చేస్తున్న బ్రిటిష్ పాలకులపై నిప్పురవ్వ రగిలిస్తూ భారతదేశ స్వతంత్రం కోసం తెల్లదొరల గుండెల్లో దడ పుట్టించిన అల్లూరి సీతారామరాజు జయంతిని గుర్తించుకొని నివాళులర్పించడం గర్వించదగ్గ విషయమని ఆయన తెలిపారు.

ప్రస్తుతం యువత ఆయన పోరాటాలను, త్యాగాలను పక్కనపెట్టి కుల-మతాల గొడవల్లో చిక్కుకుపోతున్నారని ఆయన అన్నారు. వర్ధంతిలు, జయంతులు రోజున అల్లూరికి నివాళులర్పిస్తూ గిరిజన హక్కులను, సంపదను కాపాడుతున్నామని చెప్పుకుంటున్న ఈ రాజకీయ నాయకులు ఈ రోజున ఆపరేషన్ కగార్ పేరుతో అడవులను, సంపదను దోచేస్తున్నారని ఆయన తెలిపారు. ఎప్పుడైతే పీడిత జన విముక్తి కోసం పోరాటం చేస్తామో అప్పుడే అల్లూరి సీతారామరాజుకు ఘనమైన నివాళులు అర్పించడం అని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రంగవల్లి నగర్ లో ఉన్న షహీద్ భగత్ సింగ్, రంగవల్లి అక్క కు ఆంధ్రప్రదేశ్ రైతు కులి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రంగవల్లి నగర్ నాయకులు కొండేపూడి మంగయమ్మ, డాన్ శ్రీను, శ్రావణి, లక్ష్మణరావు, రవణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి



**నివాళులర్పించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు**

**అల్లవరం, పెన్ పవర్,జూలై 04:**భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తెల్లదొరల గుండెల్లో నిద్రపోయిన మన్యం వీరుడు, విప్లవ జ్యోతి శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు రెల్లుగడ్డ గ్రామంలో ఘనంగా జరిగాయి. రెల్లుగడ్డ గ్రామంలో అల్లూరి విగ్రహానికి అమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు త్యాగం, దేశభక్తి ఎప్పటికీ స్మరణీయమని కొనియాడారు. కేవలం 27 సంవత్సరాల చిన్న వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం, గిరిజనుల హక్కుల కోసం ప్రాణాలర్పించిన అల్లూరి యువతరం మొత్తానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లవరం మండల టీడీపీఅధ్యక్షులు సత్తి బాబు రాజు, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## వానపల్లిలో రూ.15 లక్షలతో పశువుల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన





**కొత్తపేట, పెన్ పవర్, జూలై 4:** కొత్తపేట మండలం వానపల్లి గ్రామంలో పశు సంవర్ధక రంగానికి ఊతమిచ్చే మరో అభివృద్ధి కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఆశాజ్యోతి (యూఎస్ బేస్డ్) స్వచ్ఛంద సేవా సంస్థ రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్న పశువుల ఆసుపత్రి భవనానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక రంగం రైతులకు అదనపు ఆదాయ వనరుగా నిలుస్తోందని, ఆధునిక వసతులతో పశువుల ఆసుపత్రి అందుబాటులోకి రావడం వల్ల పశువులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా గ్రామీణాభివృద్ధిలో భాగస్వాములు కావడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం ఆశాజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి బండారు సత్య పల్లంరాజు (సాయన్న కుమారుడు)ని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దుశ్శాలువ కప్పి, జ్ఞాపికగా మొక్కను అందజేసి సత్కరించారు. గ్రామ అభివృద్ధికి సంస్థ అందిస్తున్న సహకారాన్ని ఆయన ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల భోదనలు శ్రద్ధగా విని చదువుకోవాలి

**ఐపీఎస్ అధికారి మోకా సత్తి బాబు**

**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 4:** విద్యార్థులు ఉపాధ్యాయులు భోదించిన పాఠ్యాంశాలు శ్రద్ధగా విని చదువుకోవాలని అప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందని ఐపీఎస్ ఆఫీసర్ మోకా సత్తి బాబు సూచించారు. మండలంలోని ఇసుకపూడి గ్రామం దాసరి వారి పేట, సిద్ధార్థ నగర్ ఎం.పీ.పీ పాఠశాల విద్యార్థులకు జక్కంశెట్టి సంధ్య అధ్యక్షతన గ్రామ దత్తత అధికారి ఐపీఎస్ ఆఫీసర్ మోకా సత్తి బాబు గ్రామములో ఉన్న అయిదు ప్రైమరీ పాఠశాలకు ఉచితంగా నోటుపుస్తాకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని విద్యార్థులు ఉన్నతమైన భావాలతో ఉన్నతమైన చదువులు చదివి బావితరాలకు ఆదర్శంగా నిలవాలని ప్రతీ ఒక్కొక్కరు ఆఫీసరు కావాలని చిన్నారులను ఆశీర్వదించారు.. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యులు కోట విజయరాజు, అయినవిల్లి మండలం ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షులు గోసంగి బంగార్రాజు, మాజీ వార్డ్ మెంబర్ కత్తుల నాగేశ్వరరావు, జిత్తుగ టార్జన్, రొక్కాల బాలకృష్ణ బీర రవికుమార్, గోసంగి విజయభాస్కర్, అంబటి ఏడుకొండలు, నెల్లి సత్యనారాయణ (సత్య, ) గోసంగి



రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లి తండ్రులు చిన్నారులు పాల్గొన్నారు...




## పేద ప్రజల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగా 79వ జయంతి



**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 4:** పేద ప్రజల ఆశాజ్యోతి, బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం పోరాడిన నాయకుడు వంగవీటి మోహన్ రంగా అని పలువురు నాయకులు కొనియాడారు. ఆయన 79వ జయంతిని అంబాజీపేట, మాచవరం లలో ఘనంగా నిర్వహించారు.

కొర్లపాటివారిపాలెం కాపు యువత ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్ ఎదురుగా ఉన్న రంగా విగ్రహానికి కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మాచవరం యువత ఆధ్వర్యంలో రంగా విగ్రహానికి పూలమాలలు వేసి పేద, బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు అరిగెల సూరిబాబు, ఆత్మా డైరెక్టర్ పత్తి దత్తుడు, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, నాయకులు గణపతి వీర రాఘవులు, సుంకర బాలాజీ, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, రవణం రాము, కొర్లపాటి కోటబాబు, దొమ్మేటి సాయికృష్ణ, సూదాబత్తుల రాము, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, మంచాల నోకేష్, సుంకర పేరయ్యానాయుడు, దొమ్మేటి రామారావు, మేడిది శ్రీ ను, అరిగెల శివకళ్యాణ్, రవణం విజయ్, సూదాబత్తుల రమేష్, కామిశెట్టి పండు, వంగా చిన్నా, నాయకులు, రంగా అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ర్యాలి జగన్మోహిని కేశవస్వామి సన్నిధికి పోటెత్తిన భక్తజనం





**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 4:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ జగన్మోహిని కేశవస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఐదు బుధవారాల జగన్మోహిని కేశవస్వామిగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రంలో మొక్కులు చెల్లిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.

ఉదయం తెల్లవారుజామున స్వామివారికి మేలుకొలుపు సేవతో ఆలయ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం సుప్రభాత సేవ, విశేష అలంకారం, అర్చనలు, ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి సీతారామాచార్యులు శాస్త్రోక్తంగా, వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవస్థానంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన పథకానికి విరాళాలు అందించిన దాతలను ఆలయ వేదపండితులు వెంకట అవధాని వేదాశీర్వచనాలతో ఆశీర్వదించారు. గ్రామానికి చెందిన లలితా పారాయణదారులు శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీ మణిద్వీప పారాయణం నిర్వహించగా, భక్తులు భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దర్శనం, తీర్థప్రసాదాల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్వహించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ నాగేశ్వరరావు, కార్యనిర్వహణ అధికారి దారపురెడ్డి సురేష్‌బాబు పర్యవేక్షణలో తాగునీరు, క్యూలైన్లు, ప్రసాదాల పంపిణీ, ఇతర సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించారని పేర్కొన్నారు

## పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనే లక్ష్యంగా పార్టీ సేవలకు దరఖాస్తు సమర్పించిన జనసేన ఇంచార్జ్ రమేష్




**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** కాకినాడలోని ఫాబిన్ కన్వెన్షన్‌లో కాకినాడ పార్లమెంటరీ సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న జనసేన నాయకులు, జనసైనికుల నుంచి పార్టీ పదవులకు దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాల సాధన కోసం మరింత సమర్థవంతంగా పార్టీకి సేవలందించాలనే సంకల్పంతో జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తన దరఖాస్తును కాకినాడ పార్లమెంటరీ అబ్జర్వర్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకి సమర్పించారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం, జనసేన సిద్ధాంతాల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, పార్టీ ఏ బాధ్యత అప్పగించిన పూర్తి నిబద్ధతతో నిర్వర్తిస్తానని తెలిపారు.

## జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అల్లూరి జయంతి



**జగ్గంపేట, పెన్ పవర్, జూలై 4:** జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి. చెన్నారావు ఆధ్వర్యంలో చరిత్ర విభాగం అధ్యాపకులు రాయుడు శ్రీను అల్లూరి సీతారామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య సమరంలో పోషించిన విశిష్ట పాత్రను, ఆయన దేశభక్తిని, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం చేసిన పోరాటాలను కొనియాడారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని దేశ సేవకు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వంగవీటి మోహనరంగా ఆశయాలు చిరస్మరణీయం



**79వ జయంతి సందర్భంగా రామచంద్రపురంలో ఘన నివాళులు అర్పించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, పెన్ పవర్ జూలై 4:** దివంగత ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా 79వ జయంతి సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం రామచంద్రపురంలోని వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, ప్రజల కోసం నిరంతరం పోరాడిన ధైర్యవంతుడైన నాయకుడిగా వంగవీటి మోహనరంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన చేసిన సేవలు నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ప్రజల పట్ల అంకితభావం, నిబద్ధత, సేవా తపన కలిగిన నాయకుడిగా వంగవీటి మోహనరంగా పేరు చిరకాలం గుర్తుండిపోతుందని మంత్రి అన్నారు. యువత సమాజ సేవలో ముందుండి ప్రజల కోసం పనిచేయాలనే స్ఫూర్తిని ఆయన జీవితం అందిస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వంగవీటి మోహనరంగా అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

## అంబాజీపేటలో ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి



**అంబాజీపేట: పెన్ పవర్, జూలై 4:** స్వతంత్ర సమరయోధుడు, విప్లవ యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం చిరస్మరణీయ మని నాయకులు గణపతి వీరాఘవులు కొనియాడారు. సమాచార హక్కు కార్యకర్తల ఆధ్వర్యంలో స్వతంత్ర సమరయోధుడు, విప్లవ యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉందుర్తి నాగబాబు, మాచవరపు శివ నారాయణ లు మాట్లాడుతూ ఆయన పోరాట యోధులని మన్యం వీరునిగా పేరొందారని అల్లూరి జీవిత చరిత్రను ఆయన సంచరించిన ప్రాంతాల్లో నేర్చుకున్న గిరిజన విద్యలు, మర్మకల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల జమీలు, ఆదుర్తి నారాయణమూర్తి, కొల్లూరి దివాకర్, వీరిన గోపాలం చింతపల్లి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

## మహానేతలకు చిర్ల జగ్గిరెడ్డి ఘన నివాళి



**పెన్ పవర్ రావులపాలెం జూలై 4:** వంగవీటి మోహన్ రంగా, అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శనివారం గోపాలపురం, రావులపాలెంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని మహనీయుల విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన వంగవీటి మోహన్ రంగా సేవలు చిరస్మరణీయమని అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అలాగే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్య సమర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడికి ఆదర్శమని కొనియాడారు. మహనీయుల ఆశయాలను కొనసాగిస్తూ సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రజలకు న్యాయం జరిగేలా పనిచేయడమే వారికి నిజమైన నివాళి అని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని మహనీయులకు నివాళు లర్పించారు.

## వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్




**అల్లవరం, పెన్ పవర్, జూలై 04:** వంగవీటి మోహనరంగా గారి 79వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ గారు ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం నందు రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన ప్రజానాయకుడని కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

నేటి యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగుతూ, ప్రజల కోసం సేవ చేసే తత్వాన్ని అలవర్చుకోవాలని, రంగా సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకోవాలని బొమ్మి ఇజ్రాయిల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు చేట్ల సత్యనారాయణ, బి ముఖేష్, బి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార వారోత్సవాలకు ఘన శ్రీకారం




**కాకినాడ, పెన్ పవర్,జూలై 4:** కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ నిర్ణయం మేరకు జూన్ 29 నుంచి జూలై 6 వరకు నిర్వహిస్తున్న సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం కాకినాడ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహకార సంఘాల ప్రాధాన్యత,గ్రామీణాభివృద్ధిలో వాటి పాత్రను వివరించారు.ఈ కార్యక్రమంలో కోలంక సహకార సంఘం అధ్యక్షుడు బొండా వెంకట నరసింహ నాయుడు, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షుడు బొండా వెంకన్న, డీసీసీబీ సీఈఓ ప్రవీణ్, డీసీఓ శ్రీనివాస్ రెడ్డితో పాటు డీసీసీబీ సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సహకార రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు




**కాకినాడ, జూలై 4:** స్థానిక లక్ష్మీనారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శనివారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలిపారు.ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు మహర్షి సాగర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం డాక్టర్ నాయుడు మాట్లాడుతూ, సాయుధ పోరాటం ద్వారా బ్రిటిష్ పాలకులను ఎదిరించి గిరిజన సైన్యంతో స్వాతంత్ర్య సమరాన్ని నడిపిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహోజ్వల శక్తిగా నిలిచారని అన్నారు. నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడిన ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని,విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని సమాజానికి సేవ చేసే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విజేతలకు మహర్షి సాగర్ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల కార్యదర్శి డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు టి. తేజేశ్వరరావు, డి. అశ్విని, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు అండగా ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు

* రూ.82 వేల ఆర్థిక సహాయం అందజేత



**ద్రాక్షారామం, పెన్ పవర్,జూలై 4:** ద్రాక్షారామం మార్కెట్‌లో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన బాధితులకు అండగా ద్రాక్షారామం మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు స్వచ్ఛందంగా రూ.82 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ మొత్తాన్ని సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంకు చెక్కులు, నగదు రూపంలో అందించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్ మాట్లాడుతూ, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. అగ్నిప్రమాద బాధిత కుటుంబాలు త్వరగా సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున నాగేశ్వరి, డైరెక్టర్లు నారపరెడ్డి బలరాం, పీలుక రాఘవేంద్రరావు, కొల్లు వెంకటేశ్వరరావు, గున్న వినోద్ కుమార్, గుండారపు నాగమణి శ్రీనివాసరావు, కండవల్లి శ్రీనివాసరావు, మరివాడ చిన్న కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# నయన మనోహరంగా జనార్ధనస్వామి వారి దర్శనం



**ఆలమూరు, పెన్ పవర్,జూలై 04;**ఆలమూరు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారు శనివారం విశిష్ట అలంకరణలో నయన మనోహరంగా భక్తులకు కన్నుల పండుగ చేశారు. గులాబీలు, కనకాంబరాలు, మల్లెలు, తులసీ మాలల సోయగాలతో స్వామివారు నవ నవోన్మేషంగా వెలుగులీనుతూ భక్తులకు దర్శనమిచ్చారు. నాలుగు శనివారాలు, నాలుగు ప్రదక్షిణల భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు ఖండవిల్లి ప్రభాకరాచార్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, సభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి మరీ పర్యవేక్షించారు.

# అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలి.

**-సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ఎస్ రాంకుమార్.**



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 4 :** మన్యం విప్లవ వీరుడు, స్వాతంత్ర సమరయోధుడు, బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, విశ్రాంత ఉపాధ్యాయులు సీనియర్ రాజకీయ నాయకులు ఎస్ ఎస్ రామ్ కుమార్ అన్నారు. మండల మండల కేంద్రమైన కిర్లంపూడి శ్రీ కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర గురించి, ఆయన మన్యం ప్రజల్లో తీసుకువచ్చిన చైతన్యం, స్వాతంత్ర పోరాటంలో ఆయన పాత్ర వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమకారులు జీవిత చరిత్రలను, తెలుసుకొని ప్రతి ఒక్కరూ వారి అడుగుజాడల్లో నడవడమే కాకుండా, ఆశయ సాధన కృషి చేయాలన్నారు. భారతరత్న డాక్టర్ గుల్జారి లాల్ నంద కేంద్ర మంత్రిగా, భారతదేశ ఆపద్మ ప్రధానమంత్రిగా రెండుసార్లు చేసి నిరాడంబ జీవితాన్ని గడిపారని ఆయన జయంతి కూడా ఇదే రోజు అన్నారు. ఆయన చినిపోయే రోజు జేబులో ఒక్క రూపాయి కూడా లేదని అటువంటి మహా నాయకులు ఉన్న భారతదేశం పుట్టడం మన అదృష్టం అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి రమణికుమారి, పాఠశాల ఎక్స్ అఫీషియల్ సభ్యులు దాడి గోవిందు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు

# బూరుగుపూడిలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు.







**-అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.**

**-ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి కర్ణాకులు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 4:**బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించి,తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశ రాజకీయ నాయకులు స్వాతంత్రం వచ్చిందని చప్పట్లు కొట్టుకుంటున్నారే తప్ప స్వాతంత్రం ఏమీ రాలేదని, ఎక్కడ దోపిడీ అక్కడే జరుగుతుందని ఆయన తీవ్రంగా విమర్శించారు. పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టి, నివాళులర్పిస్తూ దేశ సంపదను, ప్రజలను దోసుకుంటున్నారని విమర్శించారు. అల్లూరి ఆశయాలు,సిద్ధాంతాలు ముందుకు తీసుకెళ్లాలంటే పెద్ద పెద్ద విగ్రహాలు పెట్టినంత మాత్రాన అవ్వదని ఆయన ఆశయాల కోసం, సిద్ధాంతాల కోసం అనునిత్యం పోరాటం చేయాలని, అప్పుడే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని ఆయన అన్నారు.కార్మికులు,కర్షకులు,రైతు కూలీలు,యువత ఆయన పోరాటాన్ని గుర్తించి ముందుకు పోవాలని ఆయన పిలుపునిచ్చారు.

అనంతరం కర్నాకుల వీరాంజనేయులు తల్లిదండ్రులకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి బి.రమేష్,డాన్ శ్రీను, బూరుగుపూడి గ్రామస్తులు కర్నాకుల సూరిబాబు,మహేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# మందపల్లి శ్రీ మందేశ్వరస్వామి ఆలయానికి రూ.2.87 లక్షల ఆదాయం



**కొత్తపేట, పెన్ పవర్, జూలై 4:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానానికి శనివారం వివిధ పూజలు, విరాళాల ద్వారా రూ.2,86,941 ఆదాయం సమకూరింది.ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున తైలాభిషేకాలు, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ముఖమండప సేవల ద్వారా రూ.12,600, ఏకాదశ రుద్ర తైలాభిషేకాల ద్వారా రూ.45,750, మహాన్యాస పూర్వక తైలాభిషేకాల ద్వారా రూ.29,050, తైలం సమర్పించి దర్శనం ద్వారా రూ.13,360, తిలదానం ద్వారా రూ.350, స్వయం హోమాల ద్వారా రూ.1,600 ఆదాయం లభించింది. ఈ సేవల ద్వారా మొత్తం రూ.1,02,710 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.అదనంగా ఫోన్‌పే (పీఓఎస్) చెల్లింపుల ద్వారా రూ.30,285, పరోక్ష పూజల ద్వారా రూ.92,200, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.61,746 సమకూరడంతో మొత్తం ఆదాయం రూ.2,86,941కు చేరింది.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయంలో నిత్యపూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సక్రమంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహన్ రంగ కు ఘన నివాళి





**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 4:**వంగవీటి మోహన్ రంగా జయంతి సందర్భంగా ఆత్రేయపురంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణరాజు (బాబు), తాడిపూడి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రమేష్‌రాజు, గ్రామ పెద్దలు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన రంగా సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలను ఆత్రేయపురంలో ఘనంగా నిర్వహించారు. వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గిరిజనుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలు నేటి యువతకు ఆదర్శమని అన్నారు. ఆయన త్యాగస్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకుని దేశభక్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు పాల్గొని మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

# ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి రంగా -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట, పెన్ పవర్, జూలై 04:** పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయ మని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు.

బెల్లంపూడి గ్రామం, ఆదిమూలం వారిపాలెం, నరేంద్రపురం గ్రామాల్లో స్వర్గీయ వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, స్వర్గీయ వంగవీటి మోహనరంగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయ మని పేర్కొన్నారు. యువత సమాజ సేవను ఆదర్శంగా తీసుకుని ప్రజలకు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ రాష్ట్ర డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏఎంసు చైర్మన్ చిట్టూరి శ్రీ నివాసరావు, టిడిపి కోఆర్డినేటర్ దాసరి వివి సత్యనారాయణ, తోలేటి చినకాపు, అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, యడ్ల యేసుభాస్కరరావు, బీర వెంగమాంబ బాపూజీ, తాటికాయల వెంకటేష్, గుత్తుల చంటి, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వంగవీటి మోహనరంగా గారికి ఘనంగా నివాళులర్పించారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# చదువుకునే వయసులో సెల్ ఫోన్ కు బానిస కావొద్దు






**ప్రముఖ సినీ,టీవీ నటులు, వ్యాఖ్యాత ప్రదీప్**

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 04;** చదుకునే వయసులో అమ్మాయిలు సెల్ ఫోన్లు కు బానిసై జీవితాలను పాడు చేసుకోవద్దని ప్రముఖ సినీ,టీవీ నటులు, యాంకర్, వ్యక్తిత్వ వికాస నిపుణులు కెవి. ప్రదీప్ సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చెముడులంక శ్రీ షిరిడి సాయి విద్యాసంస్థల వారి ఈశ్వర విద్యాలయ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది అమ్మాయిలు చదువుకునే వయసులో ఈ సెల్ ఫోన్ ద్వారా సోషల్ మీడియా ఉచ్చులో పడి ఆర్థికంగానూ, మానసికంగానూ, వ్యక్తిగతంగాను తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. బంగారు భవిష్యత్తును చేజేతులా పాడు చేసుకుంటున్నారన్నారు. ప్రస్తుత సమాజంలో అబ్బాయిలకు దీటుగా అమ్మాయిలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని అయితే కొంతమంది అమ్మాయిలు సరదాగా సెల్ ఫోన్ ను ఆశ్రయించి చేజేతులా భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ చదివే అమ్మాయిలు యుక్త వయసులో ఉండటంవల్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కేవలం చదువు పైన దృష్టి పెట్టి తమ లక్ష్యాలను అందుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అబ్బాయిల కంటే అమ్మాయిలకు కూడా ఉద్యోగ అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. అందువల్ల ఎవరికి వారు పోటీపడి జీవితంలో రాణించడం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చదువుకునే వయసులో సరదాలు,షికార్లు ఉండకూడదని కాదు గాని పరిమితి దాటి ఉండడం వల్ల జరిగే అనర్ధాలను అనేక ఉదాహరణలతో ఆయన వివరించారు. అలాగే చిన్న వయసు నుంచి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అందుకున్న వారి గురించి కూడా ఆయన ఈ అమ్మాయిలకు క్షుణ్ణంగా వివరించారు. ప్రదీప్ ప్రసంగం ఆద్యంతం విశేషంగా ఆకట్టుకుంది. ఆయనకు విద్యాసంస్థల చైర్మన్ ఉమారాణి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మరో వ్యక్తిత్వ వికాస నిపుణులు దారపు నాగిరెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.




# కోనసీమ తిరుమలలో పోటెత్తిన భక్తజనం







- ఏడువారాల వెంకన్న నోములతో మారుమోగిన ఆలయ మాడవీధులు
- వైభవంగా మేలుకొలుపు సేవలు.. సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శనలు

**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 4:** కోనసీమ తిరుమలగా భక్తుల విశ్వాసాన్ని చూరగొన్న శ్రీ వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేకువజాము నుంచే భక్తుల రద్దీ భారీగా నెలకొంది. శనివారం శ్రీ వెంకటేశ్వరస్వామి దర్శనానికి విశేష ప్రాధాన్యం ఉండడంతో కోనసీమ జిల్లాతో పాటు కాకినాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు రెండు తెలుగు రాష్ట్రాల వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు భక్తుల రాకపోకలతో సందడిగా మారగా, గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. శ్రీ వెంకటేశ్వరస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో ఏడువారాల వెంకన్న నోము నోచుకునే భక్తులు తెల్లవారుజామునే ఆలయానికి చేరుకుని ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించారు. ప్రతి ప్రదక్షిణలోనూ “గోవింద… గోవింద…”, “శ్రీనివాస… వెంకటేశా…” అంటూ భక్తులు నామస్మరణ చేస్తూ తమ మొక్కులను చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా వచ్చిన మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో నోములు ఆచరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అంతకుముందు స్వామివారి సన్నిధిలో మేలుకొలుపు సేవను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఐశ్వర్య లక్ష్మీ హోమం, సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన, అలంకరణోత్సవం తదితర నిత్యకైంకర్యాలు వైదిక సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించారు. సుగంధభరితమైన పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన స్వామివారికి తొలి హారతి సమర్పించగా, చందన స్వరూపుడైన శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. తొలి దర్శనం కోసం వేకువజాము నుంచే క్యూ లైన్లలో వేచిచూసిన భక్తులు స్వామివారి కృపాకటాక్షాలు లభించడం తమ అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు.

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గౌతమి గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయానికి చేరుకున్నారు. తమ మొక్కులు తీర్చుకునే క్రమంలో పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. అనంతరం సంప్రదాయ వస్త్రధారణతో ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ లైన్లలో వేచి ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. చిన్నారులతో వచ్చిన కుటుంబాలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. దర్శనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా అదనపు క్యూ లైన్లు, తాగునీటి సదుపాయం, నీడ ఏర్పాట్లు, వైద్య శిబిరం, పారిశుద్ధ్య చర్యలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఆలయ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. రద్దీ ప్రాంతాల్లో భక్తులను క్రమబద్ధంగా దర్శనానికి పంపిస్తూ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించారు. ఈ ఏర్పాట్లన్నింటినీ ఆలయ కార్యనిర్వహణాధికారి నల్ల సూర్య చక్రధర్ రావు స్వయంగా పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ధర్మకర్త మండల సభ్యులుఅన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేశారని తెలిపారు. భక్తులు కూడా ఆలయ నిబంధనలను పాటిస్తూ సహకరించాలని ఆయన కోరారు.

సాయంత్రం ఆలయ సాంస్కృతిక కార్యక్రమాల సందర్భంగా స్వామివారి సన్నిధిలో కాకినాడ, అమలాపురానికి చెందిన మంజీరా నాట్యాలయ విద్యార్థులు గురువు పి. దుర్గారావు ఆధ్వర్యంలో అద్భుతమైన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వైభవాన్ని ప్రతిబింబించే కీర్తనలు, భక్తి గీతాలకు అనుగుణంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన ‘ధర్మపథం’ కార్యక్రమంలో వేద పండితులు ధర్మం, సంస్కృతి, సనాతన సంప్రదాయాల విశిష్టతను వివరించారు. భక్తులకు మంత్రోపదేశం చేయడంతో పాటు ఆధ్యాత్మిక సందేశాలను అందించి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.



## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన నోడల్ అధికారి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,జూలై 4:** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా 36- ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గానికి నోడల్ అధికారిగా నియమించబడిన డి. తిప్పే నాయక్, కాకినాడ జిల్లా రెవిన్యూ అధికారి మండల కేంద్రమన ప్రత్తిపాడు,తోపాటు మండలంలోని లంపకలోవ గ్రామాలలో జరుగుతున్న సర్ ప్రక్రియను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియ వేగవంతంగా నిర్వహించాలని బూత్ లెవెల్ అధికారులకు సూపర్వైజర్లకు సూచించారు.

## అల్లూరి ఆశయాలను భావితరాలకు చాటాలి



**కొత్తపేట,పెనపవర్,జూలై 4:** అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా వాడపాలెం వంతెన సెంటర్‌లో బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఆత్మ కమిటీ డైరెక్టర్ పాలాటి మాధవ స్వామి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఆర్ఎస్ఎస్ బౌద్ధ ప్రముఖ్ తొగరు ఆంజనేయులు ముఖ్య వక్తగా పాల్గొని అల్లూరి సీతారామరాజు జీవితం, త్యాగాలు, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన పాత్రను వివరించారు.

ఈ సందర్భంగా పాలూరి సత్యానందం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచి ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ఆయన స్ఫూర్తి నేటికీ యువతలో దేశభక్తిని, ధైర్యాన్ని నింపుతోందన్నారు. అల్లూరి మరణానంతరం ఆయన ఉద్యమం, తాత్వికత, పోరాట విశిష్టతను దేశవ్యాప్తంగా విస్తృతంగా చాటి చెప్పే ప్రయత్నాలు తగిన స్థాయిలో జరగలేదని, భావితరాలకు ఆయన చరిత్రను చేరవేయడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. గిరిజనులు ఇప్పటికీ అల్లూరిని తమ ఆరాధ్యుడిగా భావిస్తూ ఆయన జ్ఞాపకాలను కాపాడుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో పెదపూడి బాపిరాజు, యువ మోర్చా రాష్ట్ర నాయకుడు పాలూరి జయప్రకాశ్ నారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొల కోటి వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్ మద్దంశెట్టి శ్రీనివాసరావు, కిసాన్ మోర్చా నాయకుడు ఉద్దరాజు ప్రసాద్‌రాజు, జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు కోటిపల్లి దామోదర్, జిల్లా యువ మోర్చా కార్యదర్శి వలపశెట్టి కిరణ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు కోటిపల్లి రఘురామ్‌తో పాటు సిద్ధంశెట్టి గంగారావు, సిద్ధంశెట్టి శంకర్, రేలంగి ఆంజనేయులు, అన్యం సత్యనారాయణ, అజ్జరపు సత్యనారాయణ తదితరులు పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# వేదిరేశ్వరం హైస్కూల్‌లో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు





**కొత్తపేట, పెన్ పవర్, జూలై 4:** వేదిరేశ్వరం హైస్కూల్‌లో శనివారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల చైర్మన్ మారే సుబ్బాయమ్మ మాట్లాడుతూ 1897 జూలై 4న పాండ్రంగిలో జన్మించిన అల్లూరి చిన్ననాటి నుంచే విప్లవ భావజాలంతో బ్రిటిష్ పాలనకు ఎదురు నిలిచారని, గిరిజనుల హక్కులు, సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన త్యాగం, ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు వి. మురళీకృష్ణ మాట్లాడుతూ దేశానికి విశిష్ట సేవలు అందించిన మహనీయులను సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని, విద్యార్థులు అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని సూచించారు. తెలుగు పండిట్ సత్యవతి మాట్లాడుతూ అల్లూరి, మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల సేవలు భావితరాలకు మార్గదర్శకమని అన్నారు. అనంతరం చైర్మన్, పీఈటీ వై. ప్రసాద్, సర్వారాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్. రాంప్రసాద్, కె. ఈశ్వర్ రెడ్డి తదితర ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజును ఆదర్శంగా తీసుకోవాలి.

- పిసీసీ సభ్యులు ధరణాలకోట శ్రీను.




**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 4:** విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను అన్నారు. శనివారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ప్రత్తిపాడు అల్లూరి సీతారామరాజు సెంటర్లో పిసిసి సభ్యులు మరియు జిల్లా ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం జిల్లా నాయకులు కొప్పన కోటేశ్వరావు, కందిమల్ల శామ్యూల్,ఏనుగుపల్లి రాంబాబు. ఈరుగులచక్రం తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేటలో అంగన్వాడీ నియామకాల ప్రక్రియ వేగవంతం



**కొత్తపేట,పెనపవర్,జూలై 4:** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాల్లో ఖాళీగా ఉన్న 32 అంగన్వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి శనివారం కొత్తపేట రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి. సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఇంటర్వ్యూలకు నియామక కమిటీ సభ్యులైన జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి కె. నాగమణి, సీడీపీవో ఎ. గజలక్ష్మి, వైద్యాధికారి మంగాదేవి హాజరయ్యారు.

మొత్తం 32 పోస్టులకు 77 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 72 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు రెవెన్యూ డివిజనల్ అధికారి జి.వి.వి. సత్యనారాయణ తెలిపారు. నియామక ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

## డాక్టర్ చిరంజీవినీ కుమారి కాంస్య విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభం



**కాకినాడ, పెన్ పవర్,జూలై 4:** ప్రముఖ విద్యావేత్త, సంఘసేవకురాలు, ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి కాకినాడ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన డాక్టర్ చిరంజీవినీ కుమారి జ్ఞాపకార్థం ఆమె కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ కాలేజీ ప్రాంగణంలో సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 19న డాక్టర్ చిరంజీవినీ కుమారి వద్ద విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు, ఆమెతో కలిసి పనిచేసిన అధ్యాపకులు, విద్యాసంస్థ ప్రతినిధులు, అభిమానుల సమక్షంలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాల్లో స్థిరపడిన ఆమె శిష్యులు, పూర్వ విద్యార్థులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రస్తుతం విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని కళాశాల సిబ్బంది పేర్కొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ తో బాధితులకు ఆర్థిక చేయూత -ఎమ్మెల్యే బండారు



**ఆలమూరు,పెన్ పవర్, జూలై 04;**సీఎం రిలీఫ్ ఫండ్ తో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన రోగులైన బాధిత కుటుంబాలకు ఆర్థికంగా చేయూత లభిస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు.మండల కేంద్రంలో సొసైటీ వద్ద ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అర్హులకు మంజూరు కాగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు అండగా నిలుస్తున్నారని, పేద, మధ్యతరగతి వర్గాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉపశమనం కలుగుతుందన్నారు. వైసీపీ హయాంలో సీఎం రిలీఫ్ ఫండ్ అనేది పేదలకు అందని ద్రాక్షగా ఉండేదన్నారు.తమకు కావలసినవారికి మాత్రమే రిలీఫ్ ఫండ్ అందజేసేవారని, కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ మేలు జరుగుతుందన్నారు. అటు ఎన్టీఆర్ ఆరోగ్య సేవ,ఇటు ఇన్సూరెన్స్ కవర్ కాని రోగులకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. ఇందులో భాగంగా మండలానికి చెందిన 76 మందికి రూ.33,37,777ల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మండలంలోని కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

ఎంపీపీ లక్ష్మణరావు, ఎంపీడీవో రాజు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మి ప్రత్యూష




**ఆలమూరు, పెన్ పవర్, జూలై 04;**అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధుల సమన్వయంతోనే మండలాభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, మండల ప్రత్యేక అధికారి డి. లక్ష్మీ ప్రత్యూష, ఎంపీడీవో ఏ. రాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవో రాజు ఆధ్వర్యంలో ఎంపీపీ లక్ష్మణరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రజా ప్రతినిధుల మధ్య వాడి వేడిగా చర్చలు జరిగాయి. ముందుగా ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలను క్షుణ్ణంగా వివరించారు. వీటిపై ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను లేవనెత్తి అధికారులను నిలదీశారు. చివరగా వారు మాట్లాడుతూ, అధికారులు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి పట్ల తాము కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కాకపోవడాన్ని వారు తప్పు బట్టారు. ఈ కార్యక్రమంలో డిసి అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, మండల పరిషత్ ఏవో మెహర్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జాయింట్ డైరెక్టర్ పి. తిమ్మప్ప





**పదోన్నతిపై శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ, పెన్ పవర్ జూలై 4:** సమాచార, పౌర సంబంధాల శాఖ జోన్–2, విజయవాడ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన కాకినాడ డిప్యూటీ డైరెక్టర్ పి. తిమ్మప్ప శనివారం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గత మూడు నెలలుగా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రుల పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడంలో తిమ్మప్ప అందించిన సేవలను జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందినందుకు అభినందనలు తెలియజేస్తూ, జోనల్ అధికారిగా కాకినాడ జిల్లాకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.
అనంతరం పి. తిమ్మప్ప జిల్లా రెవెన్యూ అధికారి డా. టి. తిప్పే నాయక్ను మర్యాదపూర్వకంగా కలిసి, జిల్లాలో తాను విధులు నిర్వహించిన సమయంలో అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, జూలై 4:** ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలతో పాటు టౌన్ లో కాంగ్రెస్ పార్టీని పార్టీ నాయకులు కార్యకర్తలు సహకారంతో మరింత బలోపేతం చేస్తానని ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఉమ్మడి వెంకట్రావు అన్నారు. శనివారం కాకినాడ జిల్లా ఎఐసిసి జాయింట్ సెక్రెటరీ పాలక్ వర్మ , జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు అధ్యక్షతన ఏడు నియోజకవర్గాల ఇన్చార్జిలు,పార్టీ మండల అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులతో సమావేశము నిర్వహించారు. ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ నాలుగు మండలాలతోపాటు టౌన్ లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి రాంబాబు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మట్టా శివప్రసాద్ ఏడు నియోజకవర్గాల ఇంచార్జిలు,ప్రత్తిపాడు పిసిసి మెంబర్ ధరణాలకోట శీను, ఊట శ్రీను, రాముడు సూర్యనారాయణ, దొడ్డిపట్ల సుబ్బరాజు, గోనాపు శ్రీను, పలివెల మల్లేశ్వరరావు, సింగిడి లక్ష్మి,ఎనుముల రాజా, అరిగట్ల రవి, పెదిరెడ్డి వీరబాబు, కొత్తూరు గంగాధర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు 129వ జయంతి వేడుకలు

మన్యం వీరుడికి ఘన నివాళులర్పించిన కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్



**కాకినాడ, పెన్ పవర్ జూలై 4:** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. బిందుమాధవ్, ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన ధైర్యసాహసాలు, దేశభక్తి, త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మన్యం ప్రజల హక్కుల కోసం ఆయన సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని మన్యం వీరుడికి ఘన నివాళులర్పించారు.

## సీఈఐఆర్ పోర్టల్‌తో కాకినాడ పోలీసుల ఘన విజయం

బాధితులకు రూ.1.20 కోట్ల విలువైన 602 మొబైల్ ఫోన్ల అందజేత





**కాకినాడ, పెన్ పవర్,జూలై 4:** చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించడంలో కాకినాడ జిల్లా పోలీసులు మరోసారి విశేష ఫలితాలు సాధించారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జి. బిందు మాధవ్,ప్రత్యేక చొరవతో కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా నిర్వహించిన 12వ విడత మొబైల్ రికవరీ మేళాలో రూ.1,20,40,000 విలువైన 602 మొబైల్ ఫోన్లను వాటి యజమానులకు శనివారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదుల ఆధారంగా జిల్లా ఐటీ కోర్ బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఐఎంఈఐ ట్రాకింగ్, జీపీఎస్ ఆధారిత ట్రేసింగ్, డిజిటల్ ఫోరెన్సిక్ విశ్లేషణ, సైబర్ నిఘా,డేటా విశ్లేషణ వంటి సాంకేతిక పద్ధతులను వినియోగించి మొబైల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకుంది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు నిర్వహించిన 12 విడతల మొబైల్ రికవరీ కార్యక్రమాల్లో మొత్తం 4,603 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు. వీటి మొత్తం విలువ రూ.7,68,67,000 కాగా, మొబైల్ రికవరీలో రాష్ట్ర స్థాయిలో కాకినాడ జిల్లా ముందంజలో ఉందని పేర్కొన్నారు.మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.మొబైల్ ఫోన్ పోయిన వెంటనే బ్యాంక్ ఖాతాలు, యూపీఐ సేవలను భద్రపరచడం, సిమ్ కార్డును వెంటనే బ్లాక్ చేయించడం, గూగుల్ లేదా ఆపిల్ ఐడీ, బ్యాంకింగ్ యాప్‌లు, వాట్సాప్, సోషల్ మీడియా ఖాతాల పాస్‌వర్డ్‌లను మార్చుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సెకండ్ హ్యాండ్ మొబైల్ కొనుగోలు చేసే ముందు బిల్లు, బాక్స్, ఐఎంఈఐ నంబర్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని, అపరిచితుల వద్ద నుంచి మొబైల్ ఫోన్లు కొనుగోలు చేయవద్దని హెచ్చరించారు. ఈ విజయవంతమైన మొబైల్ రికవరీలో కీలకపాత్ర పోషించిన జిల్లా ఐటీ కోర్ బృందం ఇన్‌స్పెక్టర్ డి. దుర్గాశేఖర్ రెడ్డి, ఐటీ కోర్ సిబ్బంది, డీసీఆర్‌బీ, పీసీఆర్, సంబంధిత డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు మరియు మొబైల్ రికవరీ బృంద సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (పరిపాలన) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ (ఏఆర్) ఎస్. శ్రీనివాసరావు, కాకినాడ ఎస్‌డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్, ఐపీఎస్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ కె.వి.వి. సత్యనారాయణ, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గాశేఖర్ రెడ్డి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ఎ. సన్నాసిరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వి. శ్రీనివాస్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.